క్లుప్తంగా

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం



ఏఎస్‌ఐ సుదర్శన్ సతీమణి సువర్ణకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ

కడప అర్బన్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలకు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. ఏఆర్ ఎస్‌ఐ కె. రామమోహన్ కుటుంబానికి ఎస్పీ రూ. 2.25 లక్షల ఆర్థికసాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఇందులో పోలీసు వితరణ నిధి నుంచి రూ. 2 లక్షలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన టి. సుదర్శన్ సతీమణి సువర్ణకు రూ. 2 లక్షలు, ఫ్లాగ్‌ఫండ్ నుంచి రూ. 25 వేలు అందజేశారు. వాటర్‌బాయ్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన పి. రెడ్డెయ్య సతీమణి పి. తులశమ్మకు రూ. 2.50 లక్షలు ఆర్థిక సాయం చెక్కు రూపంలో అందచేశారు.

30న ఆత్మీయ సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 30న ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కెసీ బాదుల్లా పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ముస్లిం మైనార్టీల సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ముస్లింలపై వివక్షత చూపుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ నాయకులు, ధర్మ ప్రచార కమిటీ నాయకులు సయ్యద్ అహ్మద్ బాష, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు అక్రమాలపై విచారణ జరపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని మైదుకూరు పసుపు కొనుగోలులో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పసుపు కొనుగోలు అక్రమాలపై జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర రావును విచారణ కమిటీగా నియమించారని.. ఈ కమిటీ పట్ల అపోహలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో రాజకీయ బెదిరింపులు రైతులకు ఉన్నాయని, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చేత విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సెంటర్ తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అయ్యూబ్ హుస్సేన్

కడప ఎడ్యుకేషన్: కడప రవీంద్రనగర్‌లో రాష్ట్ర ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ సెంటర్, ఉర్దూ గ్రంథాలయాన్ని శుక్రవారం రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ కం సెక్రటరీ డాక్టర్ ఎన్. అయ్యూబ్ హుస్సేన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ, రాష్ట్ర స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 36 సెంటర్లలో ప్రతి సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 10వ తరగతిలో ఉత్తీర్ణులై 40 సంవత్సరాలలోపు వారు 90 రోజుల డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఉచితంగా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.

చంద్రయాన్ -3 విజయంపై సంబరాలు



చంద్రయాన్-3 విజయోత్సవాల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చంద్రయాన్-3 విజయం పట్ల సంబరాలు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, భౌతికశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ వేడుకలకు ప్రిన్సిపాల్ డా. వి. సలీం బాషా ముఖ్యఅతిథిగా విచ్చేసి భారతదేశం సాధించిన శాస్త్రసాంకేతిక ప్రగతి గురించి వివరించారు. చంద్రయాన్-3 విజయంలో కీలక పాత్ర పోషించిన శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. గురివిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీఎండబ్ల్యుఓకు అభినందన

కడప కార్పొరేషన్: జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన ఇమ్రాన్‌కు ప్రభుత్వ ఖాజీ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ హాఫీజ్ ఇసాక్ జియాయే శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసులో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లాలో మైనార్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

వరాలతల్లికి వైభవంగా పూజలు

కడప కల్చరల్ : శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా వరాల తల్లి శ్రీ వరలక్ష్మిదేవికి ఇళ్లల్లోనూ, ఆలయాల్లోనూ మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో ఉదయం, మరికొన్నింటిలో సాయంత్రం అమ్మవారి వ్రతం, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. స్థానిక భక్తులు విశేష సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు.

– కడప నగరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో మహిళా మండలి ఆధ్వర్యంలో హోమం, వ్రతం నిర్వహించారు. నగరంలోని ఇతర అమ్మవారి ఆలయాలలో కూడా వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీల పర్యవేక్షణలో పూజలకు హాజరైన భక్తులందరికీ అమ్మవారి ప్రసాదాలను, వస్త్రాలను అందజేశారు.

కనుల పండువగా..

శ్రీ వరలక్ష్మిమాత మూర్తులను ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక శ్రద్ధతో అలంకరించారు. కలశంపై అమ్మవారి ముఖ మూర్తిని ఏర్పాటు చేసి కలశంతోపాటు దాని చుట్టూ సువర్ణ ఆభరణాలను కనుల పండువగా తీర్చిదిద్దారు. మరికొన్నిచోట్ల అమ్మవారి మండపాన్ని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అమ్మవారి ముందు పల్లెంలో చిల్లర నాణేలను కుప్పలుగా పోశారు. అనంతరం అమ్మవారి పసుపు కుంకుమలను ప్రసాదంగా అందజేశారు. అమ్మవారి వ్రతాన్ని పలువురు భక్తులు తమ ఇళ్లలో కూడా నిర్వహించారు. పురోహితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇరుగు పొరుగు మహిళలు హాజరై పూజలు చేశారు. పూజలనంతరం నిర్వాహకులైన మహిళలు, ఇతర మహిళలు వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ప్రత్యేక ప్రసాదంగా గాజులు, పూజలో ఉంచిన జాకెట్ వస్త్రాలను కూడా అందజేశారు.

– ఇళ్లలో ఉదయం 9.00 నుంచి 10.00 గంటల్లోపుగా భక్తులు శ్రీ వరలక్ష్మిమాత వ్రతం, పూజలు నిర్వహించారు. అమ్మవారిని కనుల పండువగా అలంకరించారు. ఇరుగు పొరుగు ముత్తయిదువలను పిలిచి జాకెట్ వస్త్రం, పసుపు కుంకుమలు, పండ్లు తదితర అమ్మవారి ప్రసాదాన్ని «ఇస్తినమ్మ వాయనం....పుచ్చుకుంటినమ్మా వాయనం» అని అందజేశారు. వీధుల్లో భక్తుల సందడి కనిపించింది.



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గాదేవి



కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకుడు



ముత్యాల అలంకారంలో శ్రీ వాసవీ కన్యకాంబ

భక్తులకు వాయనాలు..

కడప గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి మహిళా భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ద్వారా స్వామి, అమ్మవార్ల పేరిట వాయనాలు అందజేశారు. పసుపు కుంకుమ, పూలు, పండ్లు, చీర, జాకెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు, కొండారెడ్డి, గొబ్బూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ సన్నిధిలో..

కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శ్రీ వరలక్ష్మిదేవి వ్రతం సందర్భంగా తెల్లవారుజామున అమ్మవారి మూల విరాట్‌కు శుద్ధ జలాలతో పంచామృతంలో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు.



కడప విజయదుర్గ ఆలయంలో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఆలయ ధ్యాన మండపంలో పూజల కోసం ప్రత్యేకంగా వచ్చిన దాదాపు 1500 మందికిపైగా భక్తులు వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. వరలక్ష్మి మాత ఉత్సవ మూర్తి వద్ద పూజలు చేసిన అనంతరం అర్చకులు భక్తులతో వ్రత విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వారసత్వ సంపదపై అవగాహన అవసరం

వైవీయూ/ కడప కల్చరల్: జిల్లాలోని అద్భుత వారసత్వ సంపద పట్ల విద్యార్థుల్లో అవగాహన అవసరమని ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో నగరంలోని 13 పాఠశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర , జాతీయస్థాయి వారసత్వ సంపద అంశాలపై క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నప రెడ్డి, ఇంటాక్ అనంతపురం చాప్టర్ కన్వీనర్ రాంకుమార్ మాట్లాడుతూ వారసత్వ సంపద సమాచారాన్ని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.



విజేతలతో ఇంటాక్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

రవీంద్రనాథ్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, ఇంటాక్ కో కన్వీనర్ పి.వి. సుబ్బారెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్ధన్ రాజు మాట్లాడారు. క్విజ్ పోటీలలో ప్రథమ స్థానంలో బాలవికాస్ హైస్కూల్ విద్యార్థులు , రెండో స్థానంలో శాంతినికేతన్ పాఠశాల, మూడో స్థానంలో బాలవికాస్ హైస్కూల్ 2వ జట్టు, నాలుగో స్థానంలో శాంతినికేతన్ హైస్కూల్ 2వ జట్టు నిలువగా, ప్రత్యేక బహుమతి నజీముల్ అమీన్ హైస్కూల్ జట్టుకు ప్రకటించి బహుమతులు అందజేశారు. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

ఆచార్య తుమ్మపూడి మృతి తీరని లోటు

కడప కల్చరల్ : సుప్రసిద్ధ సాహితీవేత్త, విమర్శకులు, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంత అధ్యాపకులు ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం ఆచార్య తుమ్మపూడి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆచార్య తుమ్మపూడి కవిగా, విమర్శకుడుగా, అనువాదకుడుగా, నాటకకర్తగా అందించిన సేవలు చిరస్మరణీయమైనవన్నారు. శ్రీకృష్ణదేవరాయలపై అభిమానంతో విలక్షణ రచనలు చేశారన్నారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, ఆచార్య హెచ్‌యస్ బ్రహ్మానంద, ఆచార్య పీఎల్ శ్రీనివాసరెడ్డి వంటి వారంతా ఆయన శిష్యులేనన్నారు. కడపతో ఆయనకు అనుబంధం ఉందని, భూతపురి సుబ్రహ్మణ్య శర్మ స్మారక సత్కారంతో గౌరవింపబడ్డారన్నారు. సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ ఆచార్య తుమ్మపూడి సాహితీరంగానికి చేసిన సేవలు కొనియాడారు. లైబ్రరీ అసిస్టెంట్ ఎస్. రమేష్‌రావు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



ఆచార్య తుమ్మపూడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ సిబ్బంది

రేపు 'గ్రూప్స్' విజేతలకు సత్కారం

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఇటీవల గ్రూప్-1లో టాపర్లుగా నిలిచిన అభ్యర్థులు వంకం సాయి హర్షిత, మేరువ చందులను సత్కరించనున్నామని బీసీ సంక్షేమ సంఘం నిర్వాహకులు చౌడం సూరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషతోపాటు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, కుల సంఘాల నేతలు తదితరులు హాజరు కానున్నారన్నారు.

మట్కా బీటర్లు అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత బైపాస్ రోడ్డులో షేక్ మున్నా, షేక్ అబ్దుల్ రషీద్ అనే ఇద్దరు శుక్రవారం సాయంత్రం మట్కా రాస్తుండగా సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 7వేలు నగదును, కర్ణాటకకు చెందిన మద్యం ప్యాకెట్లను, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ కాంపిటీషన్స్

వైవీయూ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ కాంపిటీషన్స్ దోహదం చేస్తాయని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి. రవిశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సుబ్బారావు విచ్చేసి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. వై. సావిత్రి, డా నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

నేడు గండిలో శ్రావణ శనివారోత్సవం

చక్రాయపేట : గండి పుణ్యక్షేత్రంలోని వీరాంజనేయ స్వామి సన్నిధిలో నేడు రెండవ శ్రావణమాస శనివారోత్సవం జరుగనుంది. గత వారం కంటే ఈవారం భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని భావించిన ఆలయవర్గాలు అందుకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. గత వారంలో తలెత్తిన చిన్నచిన్న లోపాలను సరిదిద్ది ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేశామని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. భక్తుల కోసం 22వేల లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే స్నానాలు చేసిన అనంతరం మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా తగు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల స్నానాల నిమిత్తం పాపాఘ్ని నదిలో పిల్లర్లు వేయించి స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 3 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. అలాగే రాత్రి బస చేయు భక్తులకు కాలక్షేపం నిమిత్తం కోలాటం అనంతరం సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

– రెండవ శనివారం భారీ వాహనాలను అనుమతించమని ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. లారీలు, టిప్పర్లు తదితర వాటిని వేంపల్లెలోనే ఆపేస్తామన్నారు.

– రాయచోటి వైపు నుంచి వచ్చే వాటిని చిలేకాంపల్లె క్రాస్ వద్ద నుంచి వెనక్కు పంపిస్తామన్నారు. బస్సులు కార్లు తదితరాలను భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్‌ఐలతో పాటు సుమారు 180 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారన్నారు.



గండి వీరాంజనేయస్వామి



పాపాఘ్ని నదిలో ఏర్పాటు చేసిన స్నాన ఘట్టం

నేడు బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని శ్రీరంగరాజుపల్లి సమీపంలో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంలో రెండవ శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే సీనియర్ వృషభ రాజములతో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని రూ.500 నగదు చెల్లించి రసీదు పొందాలన్నారు. మధ్యాహ్నం కోలాటం, రామాంజనేయ యుద్ధం, చింతామణి, హరిచంద్ర నాటకం ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

చింతకొమ్మదిన్నె : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆర్‌డీ అనిల్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల ప్రభుత్వం గర్భిణులపై ప్రత్యేక దృష్టి ఉంచి వారికి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. రక్త హీనత ఉన్న గర్భిణులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ భక్తవత్సలం, డి.డి.రామనాథరావు, జిల్లా మలేరియా అధికారి మనోరం, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తాం

కమలాపురం : తమ బ్యాంక్‌లో ఖాతాదారులు డిపాజిట్ చేస్తే మిగిలిన అన్ని బ్యాంకుల కన్నా అధిక వడ్డీ అందిస్తామని డీసీసీ బ్యాంక్ డీజీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని జంగంపల్లెలో ప్రజలకు డీసీసీ బ్యాంక్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించి మాట్లాడారు. డీసీసీ బ్యాంక్ అంటే కేవలం రైతులకు మాత్రమే అనే భావన ప్రజల్లో ఉందన్నారు. తమ బ్యాంక్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అన్ని రకాల రుణాలు అందిస్తామన్నారు. రైతులకు అవసరమైన దీర్ఘకాలిక రుణాలు, ల్యాండ్ డెవలప్‌మెంట్, గొర్రెలు, బర్రెలు, ట్రాక్టర్, పంటరుణాలు, పంటేతర రుణా లు అందిస్తామన్నారు. అలాగే అన్ని వర్గాల ప్రజలకు తక్కువ వడ్డీతోనే బంగారు రుణాలు, హౌసింగ్ రుణాలు అందిస్తామన్నారు. తమ బ్యాంక్‌లో కేవలం రూ.500తో మాత్రమే ఖాతా తెరవవచ్చన్నారు. లాకర్ సౌకర్యం సైతం తమ బ్యాంక్‌లో ఉందన్నారు. కమలాపురం బ్రాంచ్ మేనేజర్ సుధీర్ కుమార్ రెడ్డి, సూపర్‌వైజర్ వీరశేఖర, పెద్దచెప్పలి పీఏసీఎస్ సీఈఓ ఓబుల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా వెరిఫికేషన్ పక్కాగా జరగాలి

చెన్నూరు : బీఎల్వోలు, సూపర్‌వైజర్లు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ జాబితాను వెరిఫికేషన్ చేసి, అందులో ఓటర్‌లిస్టులో పేరు డిలీట్ అయిన వారిని గుర్తించి వారికి ఓటు హక్కు కలిగే విధంగా చర్యలు చేపట్టాలని కమలాపురం నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్టర్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024 సంబంధించి ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులు అలాగే తొలగింపులు, ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరొక పోలింగ్ స్టేషన్‌కు ఓటు బదిలీ వంటి వాటిని పక్కాగా నిర్వహించాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 36 పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ పఠాన్ అలీఖాన్, డిప్యూటీ తహసీల్దార్, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం డిక్సన్ కంపెనీ నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే జాబ్‌మేళా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ జాబ్ మేళాలో పురుషులు ఐటీఐ, డిప్లొమా, బీటెక్, మహిళలు 10వ తరగతి, ఆపై తరగతుల వారందరూ పాల్గొనవచ్చన్నారు. మండలంలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఊటుకూరు చెరువును ట్యాంక్ బండ్‌లా తయారు చేస్తాం

చింతకొమ్మదిన్నె : ఊటుకూరు చెరువును ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని నగర కమిషనర్ సాయిప్రవీణ్‌చంద్ తెలిపారు. శుక్రవారం ఆయన 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలసి ఊటుకూరు చెరువుపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గత నెల కడప పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి ఊటుకూరు చెరువును ఆధునీకరించాలని విన్నవించారు. ముఖ్యమంత్రి కమిషనర్‌కు అంచనాలు తయారు చేసి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఊటుకూరు చెరువు కట్టను కమిషనర్ పలుమార్లు పరిశీలించారు.

డబుల్ ఎంట్రీలను తొలగించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల మార్పులు, చేర్పుల్లో భాగంగా డబుల్ ఎంట్రీలను కనుగొని వాటిని తొలగించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్ కోరారు. శుక్రవారం ఓటరు చేతన్ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని వైఎస్సార్ కాలనీ బూత్ నెంబరు 265లో ఓటర్ల వెరిఫికేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాలనీలో ఎక్కువ శాతం మంది అద్దె ఇళ్లల్లో ఉంటున్నారన్నారు. వారి ఓట్లు ఇతర ప్రాంతాల్లో కూడా ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణరెడ్డి, మండల అధ్యక్షులు కృష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నచౌక్ ఎస్‌ఐగా తులసీ నాగప్రసాద్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా తులసీనాగప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో టూటౌన్, సిద్దవటం, చెన్నూరు, కమలాపురం స్టేషన్‌లలో పనిచేశారు. ప్రస్తుతం చిన్నచౌక్ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

తెలుగుభాష పాలనలో భాగం కావాలి

వైవీయూ : తెలుగుభాష పాలనావ్యవస్థలో భాగం కావాలని తెలుగుశాఖ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు ఆకాంక్షించారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు పురస్కరించుకుని నిర్వహిస్తున్న తెలుగుభాషా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైవీయూ తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలుగుభాష అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుశాఖ ఆచార్యులు ఆచార్య పి. రమాదేవి, ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ఆచార్య జి. పార్వతి, ఆచార్య ఎం.ఎం. వినోదిని, పరిశోధక విద్యార్థులు బోధన భాషగా, పరిపాలనాభాషగా తెలుగు అమలును పటిష్టంగా చేపట్టాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడేగా పాటించాలన్నారు. నగరంలోని గుంతబజారులో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై అంగన్వాడీలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 31 మంది విద్యార్థులు ఎంపిక



మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి

వైవీయూ : వైవీయూలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 31 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎల్. వీరాంజనేయరెడ్డి తెలిపారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్, యూఎస్ఏ ఆధారిత ఏపీ సోర్స్ మెడికల్ కోడింగ్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేప ట్టారు. ఏపీ సోర్స్ ప్రతినిధి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ యేడాదికి రూ.2.5 లక్షల ప్రారంభ వేతనంతో 31 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం ఏపీ సోర్స్ ప్రతినిధులు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

6 నుంచి జిల్లాస్థాయి చెస్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జిరాఫీ చెస్ అకాడమిలో జిల్లాస్థాయి బాలుర జిరాఫీ చెస్ పోటీలను సెప్టెంబరు 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు దస్తగిరి రాజ తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2008 తరువాత పుట్టిన 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులందరు అర్హులని, ఆసక్తిగలవారు ఈ నెల 31లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని, మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 73964 19042 కు సంప్రదించాలని కోరారు.

ముస్లింల ర్యాలీ

ప్రొద్దుటూరు కల్చరల్ : చంద్రయాన్ –3 ప్రయోగం విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తూ అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనలు అనంతరం వివిధ మసీదుల నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు ముస్లింలు ర్యాలీ నిర్వహించారు.